ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

అనంతపురం, రాప్తాడు, శింగనమల	:9985411608
తాడిపత్రి,	: 7659062646,
గుంతకల్లు, ఉరవకొండ,	: 9985411657,
కళ్యాణదుర్గం,	:9701120019,
రాయదుర్గం,	: 9000406723,

ఏసీఎం: 9985411154

అభివృద్ధి పథం



రాప్తాడు మండలంలో మరూరు నుంచి ఎం.చెర్లోపల్లి వరకు నిర్మించిన తారురోడ్డు

బాగుపడ్డ రహదారులు

- పరిష్కారమవుతున్న సమస్యలు
- హామీలను అమలు చేస్తూ ముందుకు..
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన
- నేటితో కూటమి పాలనకు ఏడాది పూర్తి
- నేడు తల్లికి వందనం.. 20న అన్నదాతా సుఖీభవ





వజ్రకరూరు వద్ద హంద్రీనీవా కాలువ విస్తరణ పనులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, కలెక్టర్ (ఫైల్)

అనంతపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొలువుదీరి గురువారం నాటికి ఏడాది పూర్తి అయింది. జిల్లాలోని అన్ని ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలను టీడీపీ గెలిచింది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతోంది. మెగా డీఎస్సీ, ఉచిత గ్యాస్, పింఛన్లు, అన్న క్యాంటీన్‌లు.. ఇలా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారు. వైసీపీ హయంలో విస్మరించిన హంద్రీనీవాకు బడ్జెట్‌లో రూ.3,800 కోట్లు కేటాయించారు. పనులు చకచకా సాగుతున్నాయి. జిల్లాలో పవన, సౌర విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు అవుతున్నాయి. తల్లికి వందనం సొమ్ము గురువారం, అన్నదాతా సుఖీభవ సొమ్ము ఈ నెల 20న లబ్ధిదారుల ఖాతాల్లోకి వేయనున్నారు. ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు కానుంది. ఇక నియోజకవర్గాల వారీగా అభివృద్ధి వేగంగా సాగుతోంది.

ఉరవకొండ

స్థానిక ఎమ్మెల్యే, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవతో హంద్రీనీవాకు రూ.3800 కోట్ల నిధులు కేటటాయయించారు. కాలువ విస్తరణ, లైనింగ్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. బెళుగుప్ప మండలంలో చెరువులకు హంద్రీనీవా నీటిని తరలించేందుకు రూ.3.50 కోట్లతో సబ్ స్టేషన్, 3.5 కి.మీ. పైపులైన్ పనులు జరుగుతున్నాయి. బెళుగుప్పలో ఆగిపోయిన ఆస్పత్రి పనులను పూర్తి చేశారు. ఉరవకొండ-ఉదిరిపికొండ తాగునీటి పైప్‌లైన్ పనులకు రూ.21 కోట్లు, బల్లనగుడ్డం- హావళిగి పైపులైన్ పనులకు రూ.11.50 కోట్లు ఇచ్చారు. కొనకొండ్ల వద్ద సత్యసాయి తాగునీటి పథకంలో రూ.20 లక్షలతో మైక్రో ఫిల్టర్‌లను ఏర్పాటు చేశారు. కొనకొండ్ల -చాయాపురం బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.1.40 కోట్లు, చాబాల-జనార్దనపల్లి బీటీ రోడ్డుకు రూ.75 లక్షలు, ఐదు మండలాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థకు ఉపాధి నిధులు రూ.18 కోట్లు కేటాయించి, పనులు చేశారు.

రాప్తాడు

ఎమ్మెల్యే పరిటాల సునీత తన నియోజకవర్గంలో అభివృద్ధి పనుల వేగం పెంచారు. మరూరు-చాపట్ల, మరూరు-ఎం.చెర్లోపల్లి, ఆలమూరు-ఎంబీపల్లి, బాలేపాళ్యం-నెమలివరం, రంగంపేట-సీఎస్ కోట, వెంకటాంపల్లి-ఒంటి కొండ-నామాల, పాపిరెడ్డిపల్లికి, ఎగువపల్లి-పీఆర్ కొట్టాల, పీఆర్ కొట్టాల-కొత్తగాదికుంటకు, వెంకటాపురం-ముత్యాలంపల్లి మధ్య తారు రోడ్ల నిర్మాణం పూర్తి అయింది. న్యామద్దల-చిన్నంపేట, వెల్దుర్తి-ఎర్రోనిపల్లి తండా, ముష్టికోవెల-బురుజు గుట్టపల్లి తారురోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. రాప్తాడు వద్ద రూ. 2.50 కోట్లతో, కనగానపల్లి మండలం ముత్తవకుంట్లలో రూ.3.50 కోట్లతో, ఆత్మకూరు మండలంలో రూ.4 కోట్లకు పైగా విద్యుత్ సబ్ స్టేషన్‌లను నిర్మిస్తున్నారు. ఆత్మకూరులో రూ.1.26 కోట్లతో జూనియర్ కళాశాల భవన నిర్మాణం చేపట్టారు. పీఏబీఆర్ నుంచి ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలకు తాగునీరు సరఫరా చేసేందుకు రూ.90 కోట్లతో పైప్‌లైన్ పనులు చేపట్టారు. ఉపాధి నిధులతో 300 పైగా గోకులం షెడ్లు నిర్మించారు.

అనంతపురం అర్బన్

అనంతపురం అర్బన్‌లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మూడు అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించారు. రూ.30 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టారు. రుద్రంపేట పంచాయితీలో రూ.29.50 లక్షలతో సీసీ రోడ్లు వేయించారు. విశ్వశాంతి నగర్‌లో రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. తగరకుంట ప్రధాన రహదారిని బాగుచేయించారు. రామ్ నగర్, భైరవ నగర్‌లో రూ.2 కోట్లతో తారు, సీసీ రోడ్లను నిర్మించారు. లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయించారు. రూ.19 లక్షలతో లెక్చరర్స్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. అశోక్ నగర్ బ్రిడ్జి నుంచి హౌసింగ్ బోర్డు వెళ్లే రోడ్డు సమస్యకు పరిష్కారం చూపారు. 98 మంది పేదలకు రూ.1.50 కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించారు. రూ.750 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి ప్రతిపాదనలు పంపించారు.

గుంతకల్లు

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆధ్వర్యంలో అభివృద్ధికి భారీగా నిధులు మంజూరయ్యాయి. గుత్తి మండలం బేతాపల్లిలో రూ.22 వేల కోట్లతో రెన్యూ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. పామిడి, గార్లదిన్నె మండలాల్లో పెన్నా నదిపై వంతెనల నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరయ్యాయి. గుత్తి-నాగసముద్రం డబుల్ లైన్ రోడ్డుపై రెండు బ్రిడ్జిల నిర్మాణానికి రూ.8.68 కోట్లు మంజూరయ్యాయి. నియోజకవర్గంలో సీసీ రోడ్లకు రూ.6.50 కోట్లు మంజూరయ్యాయి. నల్లగొండ, నల్లదాసరపల్లి బీటీ రోడ్లకు రూ.2 కోట్లు మంజూరయ్యాయి. 150 పశువుల షెడ్ల నిర్మాణం కోసం రూ.1.80 కోట్లు మంజూరయ్యాయి. తాగునీరు, అంగన్‌వాడీ భవనాలు, బీసీ బాలికల వసతి గృహాల్లో మరుగుదొడ్ల నిర్మాణం, బీసీ, ఎస్సీ హాస్టళ్ల మరమ్మతులకు సుమారు రూ.6 కోట్లు మంజూరయ్యాయి. కేజీబీవీల ప్రహరీలు, ల్యాబ్‌లకు రూ.కోటి వరకూ నిధులు మంజూరయ్యాయి. గుంతకల్లు మండలం ఓబులాపురం, సత్యనారాయణ పేటలో రెండు సబ్ స్టేషన్ల నిర్మాణం పూర్తైంది. గుత్తి మున్సిపల్ కార్యాలయ భవన నిర్మానానికి రూ.2.43 కోట్లు మంజూరైంది. తాగునీరు, డ్రైనేజీ సమస్య పరిష్కారానికి రూ.1.14 కోట్లు మంజూరైంది.

రాయదుర్గం

స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రూ.37 కోట్లతో హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. జీడిపల్లి నుంచి భైరవాన్‌తిప్పకు నీటిని తరలించేందుకు రూ.64 కోట్లు (భూసేకరణకు) మంజూరయ్యాయి. నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు రూ.3.70 కోట్లు మంజూరయ్యాయి. హంద్రీనీవా 36వ ప్యాకేజీ కింద ఆవులదట్ల బ్రాంచ్ కెనాల్ నిర్మాణానికి రూ.267 కోట్లతో ప్రతిపాదనలు పంపారు.మాల్యం బ్రాంచ్ కెనాల్ ద్వారా సాగునీరు అందించేందుకు భూసేకరణకు రైతులకు రూ.94 కోట్లు చెల్లించారు. ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణానికి డీపీఆర్‌ను సీఎం చంద్రబాబుకు అందించారు. రాయదుర్గంలో ప్రభుత్వ బాలికల కళాశాల భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కణేకల్లుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేశారు.

కళ్యాణదుర్గం



కళ్యాణదుర్గంలో నిర్మిస్తున్న అండర్ డ్రైనేజీ కాలువ

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చొరవతో డంపింగ్ యార్డులో చెత్త రీ సైక్లిలింగ్ పనులు ప్రారంభించారు. రూ.42 లక్షలతో ప్రహరీని నిర్మించారు. కళ్యాణదుర్గంలో రూ.16 లక్షలతో డ్రైనేజీ కాలువను శుభ్రం చేశారు. డంపింగ్ స్థలంలో రూ.3 కోట్లతో మున్సిపల్ భవనం, రూ.5 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, పాత బస్టాండులో రూ.1.80 కోట్లతో కల్వర్ట్ నిర్మాణం, టీ సర్కిల్ రూ.15 కోట్లతో వాణిజ్య భవన సముదాయం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వాల్మీకి సర్కిల్ నుంచి పాత బస్టాండ్ దాకా రూ.30 కోట్లతో అండర్ డ్రైనేజీ పనులు చేపట్టారు.

శింగనమల

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ నియోజకవర్గంలో రూ.12 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టారు. సోదనపల్లి వద్ద రూ.5 కోట్లతో కాజవే నిర్మిస్తున్నారు. 45 చెరువులుకు హెచ్చెల్సీ, పీఏబీఆర్ నీటిని కేటాయించారు. పుట్లూరు-తాడిపత్రి రహదారిని బాగు చేశారు. పుట్లూరు కేజీబీవీలో రూ.50లక్షలతో, బుక్కరాయసముద్రం కేజీబీవీలో రూ.40 లక్షలతో అదనపు భవనాలను నిర్మిస్తున్నారు. జంతులూరు వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయించారు. బుక్కరాయసముద్రం, దండువారిపల్లి చెరువుల అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు చేయించారు. కొండాపురం-సిద్దరాంపురం బీటీ రోడ్డును రూ.2 కోట్లతో నిర్మించారు. రూ.1.50 కోట్లతో యల్లనూరు-గడ్డంవారిపల్లి రోడ్డును నిర్మించారు. ముంటిమడుగులో బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.49.5 లక్షలు మంజూరు.

తాడిపత్రి

ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి ఆధ్వర్యంలో రూ.14 కోట్ల ఉపాధి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. జడ్పీ గ్రాంట్ రూ.కోటితో సీసీ రోడ్లు, రూ.5 కోట్లతో బీటీ రోడ్లు నిర్మించనున్నారు. తాడిపత్రిలో డిగ్రీ కళాశాల భవన నిర్మాణం, వసతి గృహ మరమ్మతులకు రూ.5.42 కోట్లు మంజూరయ్యాయి. కొండూరు వద్ద రూ.16.75 కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ కింద రూ.4 కోట్లు, పశువుల షెడ్ల నిర్మాణం కోసం రూ.4 కోట్లు, ఫారం పాండ్స్‌కు రూ.25 కోట్లు మంజూరయ్యాయి.

బడి గంటలు మోగే వేళ...

నేటి నుంచి స్కూళ్లు పునఃప్రారంభం

అనంతపురం విద్య, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగిశాయి. ఉరుకులు, పరుగుల జీవితం మళ్లీ ప్రారంభం కానుంది. సుదీర్ఘ కాలం ఇంటి వద్ద ఆటపాటలతో గడిపిన చిన్నారులు గురువారం నుంచి బడిబాట పట్టనున్నారు. ఇన్నాళ్లు పిల్లలు లేక బోసిపోయిన తరగతి గదులు సందడిగా మారనున్నాయి. ఇప్పటికే పలు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు పిల్లలకు స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు పూర్తిచేశాయి. అయితే ప్రైవేట్‌స్కూల్‌లో చదివే పిల్లలకు ఫీజులు, యూనిఫాంలు, పుస్తకాలు, బూట్లు, కొనుగోలుకు తల్లిదండ్రులకు ఖర్చులు తడిసిమోపెడవనున్నాయి. ఇప్పటికే విద్యాసామగ్రికి సంబంధించిన దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో సైతం కొత్త సందడి నెలకొననుంది. తొలిరోజే పిల్లలకు విద్యా కిట్లు అందజేస్తామని ఇదివరకే ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా నగరం, పట్టణ ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం స్కూల్ బస్సులు, ఆటోలతో ప్రధాన వీధులు కిక్కిరిసిపోనున్నాయి.

ఏడాది పాలన సంబరాలకు కలెక్టర్

అనంతపురంటౌన్, జూన్11(ఆంధ్రజ్యోతి): అమరావతిలో గురువారం నిర్వహించనున్న కూటమి ఏడాది పాలన సంబరాల్లో పాల్గొనేందుకు కలెక్టర్ వినోద్‌కుమార్ వెళ్లారు. సంబరాలకు కలెక్టర్లు, విజన్ ప్లాన్ యూనిట్ సిబ్బందికి ప్రభుత్వం ఆహ్వానించింది. దీంతో కలెక్టర్ బుధవారం అమరావతికి బయల్దేరి వెళ్లారు. సీపీఓ అశోక్ కుమార్, జిల్లా, నియోజకవర్గాల విజన్ యూనిట్ సభ్యులు ప్రత్యేక బస్సులో బయల్దేరి వెళ్లారు. జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఇన్‌చార్జి కలెక్టర్‌గా వ్యవహరించనున్నారు.

రసాభాస..

కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో సమన్వయకర్తల వాగ్వాదం

- గుంతకల్లు సమన్వయకర్త ఆందోళన
- వేదిక దిగి వచ్చి కింద కూర్చున్న షర్మిల



వాగ్వాదానికి దిగిన సమన్వయకర్తలు



మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

అనంతపురం న్యూటౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం రసాభాసగా మారింది. ఆందోళనలు, వాగ్వాదాలతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. సమావేశానికి హాజరైన పీసీసీ అధ్యక్షురాలు షర్మిల వేదిక దిగి వచ్చి కింద కూర్చోవాల్సి వచ్చింది. డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి టార్గెట్‌గా పలువురు విమర్శలు గుప్పించారు. వేదికపైకి అనుమతించకపోవడంతో గుంతకల్లు నియోజవర్గ సమన్వయకర్త ప్రభాకర్ కింద బైఠాయించి, నిరసన తెలిపారు. దీంతో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల వేదిక దిగి వచ్చి కార్యకర్తలతో కలిసి కూర్చున్నారు. నేతలు సర్దిచెప్పి, ఆమెను వేదికపైకి తీసుకెళ్లారు. అనంతరం ముఖ్య నేతలను మాత్రమే వేదికపైకి ఆహ్వానించారు. కళ్యాణదుర్గం సమన్వయకర్త రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఈరన్న వర్గం.. రాంభూపాల్ అనుచరులతో వాగ్వాదానికి దిగింది. ఇరువర్గాల వారికి అక్కడున్న వారు సర్దిచెప్పారు. అనంతరం షర్మిల మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైసీపీ పాలనతో జనం విసుగుచెంది, ఏకపక్షంగా కూటమికి అధికారం అప్పగించారన్నారు. దీంతో వైసీపీ వద్దనున్న కాంగ్రెస్ ఓటు బ్యాంకును తిరిగి తెచ్చుకుందామని షర్మిల పేర్కొన్నారు. సమావేశంలో పీసీసీ అధికార ప్రతినిధి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి గణేష్ యాదవ్, నేతలు కోటా సత్యం, వెంకటనరసింహులు పాల్గొన్నారు.

ఆగుతూ.. సాగుతూ..!

- ఎస్‌జీటీల కౌన్సెలింగ్‌లో గందరగోళం
- ప్రిఫరెన్షియల్‌లో జనరల్ వేకెన్సీలు
- ఉపాధ్యాయ సంఘాల అభ్యంతరం
- తొలిరోజు అర్ధరాత్రి ప్రక్రియ నిలిపివేత
- 11న సాయంత్రం తాజాగా ప్రారంభం

5



అయ్యో పాపం

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న గ్యాస్ సిలిండర్ల వాహనం

ఏడాది చిన్నారి మృతి



తన్మయి మృతదేహం

ధర్మవరంరూరల్, జూన్11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బారావు పేట వద్ద ద్విచక్రవాహనాన్ని గ్యాస్ సిలిండర్ల వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఏడాది వయసున్న చిన్నారి తన్మయి బుధవారం మృతిచెందింది. బాధితులు, రూరల్ పోలీసులు తెలిపిన మేరకు బత్తలపల్లి మండలం అప్రాచెరువు గ్రామానికి చెందిన నరసింహులు, మణికంఠేశ్వరి దంపతులు తమ మూడో కుమార్తె చిన్నారి తన్మయి(1)కలిసి ద్విచక్రవాహనంపై ధర్మవరం నుంచి స్వగ్రామానికి బయల్దేరారు. మార్గమధ్యంలో సుబ్బరావుపేట వద్దకు వెళ్లగానే అప్రాచెరువు నుంచి ధర్మవరం వైపు వస్తున్న గ్యాస్ సిలిండర్ల వాహనం ద్విచక్రవాహనాన్ని ఎదురుగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడింది. అందులో ప్రయాణిస్తున్న నరసింహులు, మణికంఠేశ్వరి, చిన్నారి తన్మయి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చిన్నారిని పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. దంపతులిద్దరూ చికిత్సలు పొందుతున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. చిన్నారి మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పూడ్చిన బాలుడి మృతదేహానికి పోస్టుమార్టం

తనకల్లు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలవారి పల్లిలో పూడ్చిన బాలుడి మృతదేహానికి వారం రోజుల తర్వాత బుధవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్ఐ గోపి తెలిపిన మేరకు ముత్యాలవారిపల్లిలో నివాసముంటున్న పుప్పాల సంధ్యారాణి, నిరీక్షకుమార్ దంపతుల కుమరుడు నిషాంత్ (3)ను ఈనెల 3న గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి ఆయా తీసుకెళ్లింది. మధ్యాహ్నం 12గంటల సమయంలో నిషాంత్ పాఠశాల ఆవరణ పక్కనే ఉన్న నీటి తొట్టెలో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఇంటికి తీసుకెళ్లి, మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. బాలుడి మృతిపై తల్లిదండ్రులు అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలను వేరువేరుగా విచారించారు. వారిరువురి సమాధానాలు పొంతనలేకుండా ఉండటంతో పోలీసులును ఆశ్రయించారు. అంగన్‌వాడీ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు మృతి చెందినట్లు తల్లి సంధ్యారాణి 11న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అనుమానాస్పద మృతికింద కేసు నమోదు చేశారు. అనంతరం డాక్టర్లను గ్రామానికి పిలిపించి బాలుడి శవాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా విచారణ కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, బంధువులు పాల్గొన్నారు.

పీఏబీఆర్‌లో మునిగి యువకుడి మృతి



భరత్‌కుమార్ (ఫైల్)

కూడేరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): అనంతపురం నగరానికి చెందిన కొత్తూరు భరత్ కుమార్(23) పీఏబీఆర్ నీటిలో మునిగి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు, అనంతపురం నగరానికి చెందిన కొత్తూరు భరత్‌కుమార్, మణి, అనిల్, భరత్ కుమార్ స్నేహితులు. వీరు నలుగురు రెండు బైక్‌లపై బుధవారం పీఏబీఆర్‌కు వెళ్లారు. నీటిలో దిగి సంతోషంగా గడుపుతున్న సమయంలో కొత్తూరు భరత్ కుమార్ ఈత రాక మునిగిపోయాడు. స్నేహితులు నీటి నుంచి బయటకు తీసి వెంటనే 108 వాహనానికి ఫోన్ చేశారు. అంబులెన్స్ ఆలస్యం కావడంతో బైక్‌పై జల్లిపల్లి వద్దకు వచ్చారు. అక్కడికి 108 సిబ్బంది చేరుకుని పరీక్షించారు. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కొత్తూరు భరత్ కుమార్ బీటెక్ పూర్తి చేశాడు. ఉద్యోగం కోసం బెంగళూరులో ఉంటున్నాడు. ఇటీవలే అనంతపురానికి వచ్చాడు. స్నేహితులతో కలిసి పీఏబీఆర్‌కు వెళ్లి ప్రాణాలు కోల్పోయాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు ప్రసాద్, విశాల, కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి, వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళా రైతు మృతి



ఉమాదేవి(ఫైల్)

గార్లదిన్నె, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోటంక గ్రామానికి చెందిన మహిళా రైతు రాగే ఉమాదేవి (39) బుధవారం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు.. కోటంక గ్రామానికి చెందిన రాగే సుబ్రహ్మణ్యం, ఉమాదేవి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. వారికి ఉన్న ఏడు ఎకరాలలో నాలుగు ఎకరాలు వేరుశనగ, మూడు ఎకరాలలో చీనీ తోటను సాగుచేస్తున్నారు. బోరుబావుల్లో నీరు ఇంకిపోవడంతో పంటలను బతికించుకునేందుకు సుమారు ఐదు బోర్లు వేశారు. దీంతో పాటు గత మూడు సంవత్సరాల నుంచి సాగుచేసిన పంటల దిగుబడి రాకపోవడంతో అప్పులు అధికమయ్యాయి. అప్పులు ఎలా తీర్చేదని తరుచూ దంపతులు గొడవ పడుతుండేవారు. అప్పులు తీర్చే మార్గంలేక ఉమాదేవి గత నెల 21 చీనీ తోటలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బెంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఫలితం లేకపోవడంతో తిరిగి అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు.

హెల్త్ ఎడ్యుకేటర్ల హోదా మార్పు

అనంతపురంటౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖలో హెల్త్ ఎడ్యుకేటర్లుగా పనిచేస్తున్న ఉద్యోగుల క్యాడర్‌ను ఇక నుంచి డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా హోదా కల్పించారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తమకు హోదా కల్పించడంపై వారు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సుబ్రహ్మణ్యం, వెంకటరమణ, వేణుగోపాల్, మహ్మద్‌రఫీ, లక్ష్మీనారాయణ, విజయబాస్కర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం వర్షం పడింది. అనంతపురం, బొమ్మనహాళ్ మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. యాడికి, పుట్లూరు, నార్పల, డి.హీరేహాళ్ తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. మంగళవారం రాత్రి కళ్యాణదుర్గంలో 12.4, యల్లనూరు 8.6 మీ.మీ వర్షపాతం నమోదైంది.

రానున్న ఐదు రోజుల్లో భారీ వర్షాలు

బుక్కరాయసముద్రం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రానున్న ఐదు రోజుల్లో ఉమ్మడి జిల్లాకు ఓ మోస్తరు నుంచి భారీ వర్ష సూచన ఉన్నట్లు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. ఏపీ తీర ప్రాంతంలోని పశ్చిమ మధ్య బంగాళఖాతంలో ఎగువ వాయు తుఫాన్ ఏర్పడిందన్నారు. సముద్రమట్టానికి 5 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉందన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఈ నెల 15 వరకు ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు తెలిపారు. పలు చోట్ల ఈదురుగాలలు 40 నుంచి 50 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుందన్నారు. అక్కడక్కడ పిడుగులు పడే అవకాశం ఉందని వాతావరణ విపత్తుల శాఖ హెచ్చరించినట్లు తెలిపారు.

గురుకుల పాఠశాల ప్రవేశాల జాబితా విడుదల

అనంతపురం సెంట్రల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు పొందేందుకు అర్హులైన విద్యార్థుల జాబితా విడుదల చేశామని ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ జయలక్ష్మి బుధవారం ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతి ప్రవేశపరీక్ష రాసిన విద్యార్థుల మార్కులు, ఖాళీసీట్ల సంఖ్య మేరకు ఎంపిక జాబితా విడుదల చేశామన్నారు. ఎంపికైన వారికి దరఖాస్తు సమయంలో ఇచ్చిన మొబైల్ నంబర్‌కు సమాచారం వస్తుందని పేర్కొన్నారు. ప్రవేశాలకు అవసరమైన పత్రాలను సమర్పించి వారంలోగా నిర్ధారణ చేసుకోవాలని సూచించారు.

పల్లె నుంచి పారిశ్రామికవేత్తలు రావాలి

బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత



మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పల్లెల నుంచి పారిశ్రామిక వేత్తలు రావాలనీ, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం యువతకు ఉద్యోగ కల్పనపై సీడాప్, సెంచూరియన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. గ్రామీణ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కంకణం కట్టుకున్నారన్నారు. చిన్నతరహా పరిశ్రమలపై యువతకు అవగాహన కల్పిస్తామన్నారు. వారు ఉత్పత్తి చేసే వాటికి ప్రభుత్వమే మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తుందన్నారు. పరిశ్రమల ఏర్పాటుపై యువతలో ఉన్న అపోహలను ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, సీడప్ స్టేట్ మిషన్ మేనేజర్ విజయకుమార్, సెంచూరియన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అనిల్‌కుమార్, ఏపీ ఫుడ్ కార్పొరేషన్ జోనల్ ఆఫీసర్ మారుతి, జేడీఎం సూర్యనారాయణ, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య పాల్గొన్నారు.

ఆగుతూ.. సాగుతూ..!

- ఎస్‌జీటీల కౌన్సెలింగ్‌లో గందరగోళం
- ప్రిఫరెన్షియల్‌లో జనరల్ వేకెన్సీలు
- ఉపాధ్యాయ సంఘాల అభ్యంతరం
- తొలిరోజు అర్ధరాత్రి ప్రక్రియ నిలిపివేత
- 11న సాయంత్రం తాజాగా ప్రారంభం



ఎస్జీటీ కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు

అనంతపురం విద్య, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీటీల బదిలీ కౌన్సెలింగ్‌లో గందరగోళం కొనసాగుతోంది. ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కు అన్నట్లుగా ప్రక్రియ సాగుతోంది. మాన్యువల్ కౌన్సెలింగ్‌ను ఇలా మొదలు పెట్టి.. అలా వాయిదా వేస్తూ కొనసాగిస్తున్నారు. విద్యాశాఖ రాష్ట్ర, జిల్లా అధికారుల అనాలోచిత నిర్ణయాలపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. నగర శివారులోని ఆర్డీటీ ఆడిటోరియంలో ఈ నెల 10వ తేదీ రాత్రి 10.30 గంటలకు కౌన్సెలింగ్ మొదలైంది. ప్రిఫరెన్షియల్ వేకెన్సీల్లో జనరల్ వేకెన్సీలు ప్రత్యక్షం కావడంతో సంఘాల నాయకులు అధికారులను నిలదీశారు. దీంతో నాలుక కొరుక్కున అధికారులు అర్ధరాత్రి 12.35 గంటల సమయంలో వాయిదా వేశారు. మరుసటి రోజు బుధవారం ఫ్రెష్‌గా కౌన్సెలింగ్ ప్రారంభించారు. అదికూడా.. ఉదయం 10 గంటలకు అని ప్రకటించి.. సాయత్రం 4 గంటలకు మార్చారు. చివరకు 5 గంటల తర్వాత కౌన్సెలింగ్ ప్రారంభించారు. కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఆర్‌జేడీ శామ్యూల్ సందర్శించారు. సీరియల్ నంబర్ 1 నుంచి 144 వరకూ ప్రిఫరెన్షియల్ కేటగిరీ టీచర్లకు, ఆ తర్వాత సీరియల్ నంబర్ సుమారు 350 వరకూ జనరల్, స్పౌజ్ టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేసుకున్నారు. రాత్రి 10.20 గంటలకు ప్రిఫరెన్షియల్ కేటగిరీ టీచర్ల కౌన్సెలింగ్ పూర్తి చేశారు. రాత్రి భోజన విరామం తర్వాత మిగిలిన టీచర్ల కౌన్సెలింగ్ ప్రారంభించారు.

వర్షాల వేళ ఏర్పాట్లు శూన్యం

ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. అనంతపురం జిల్లా కలెక్టర్ కూడా ముందుగానే ప్రకటించారు. మాన్యువల్ కౌన్సెలింగ్‌కు వందలాది మంది టీచర్లు వచ్చారు. వారి కుటుంబ సభ్యులు, బంధువులు వెంట వచ్చారు. దీంతో కౌన్సెలింగ్ ప్రాంగణం కిటకిటలాడింది. ఓ వైపు వర్షం కురుస్తున్నా అధికారులు పట్టించుకోలేదు. ఉపాధ్యాయులకు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. తగినన్ని కుర్చీలు, మంచి నీరు కూడా కూడా అందుబాటులో ఉంచలేదు. అధికారుల తీరుపై ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రిఫరెన్షియల్ దుర్వినియోగం



డీఈఓకు ఫిర్యాదు చేస్తున్న టీచర్లు

అనంతపురం విద్య, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రిఫరెన్షియల్ కేటగిరీని కొందరు టీచర్లు, జిల్లా విద్యాశాఖాధికారులు దుర్వినియోగం చేశారని అనంతపురం జిల్లా డీఈఓ ప్రసాద్‌బాబుకు బాధిత టీచర్లు రామతులశమ్మ, వెంకట శ్రీనివాసులు, రమేష్ తదితరులు బుధవారం ఫిర్యాదు చేశారు. అనంతపురం కేఎస్ఆర్ బాలికల హైస్కూల్‌లో ఆరు స్కూల్ అసిస్టెంట్లు ఇంగ్లిష్ పోస్టులు ఉన్నాయని, వీటిలో ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద 3 మాత్రమే భర్తీ కావాల్సి ఉందని అన్నారు. డీఈఓ కార్యాలయంలో పనిచేసే కొంత మంది సిబ్బంది నిర్వాకం వల్ల జీవోకు విరుద్ధంగా ఐదు పోస్టులను ప్రిఫరెన్షియల్ కింద భర్తీ చేశారని అన్నారు. దీని వల్ల సీనియారిటీ జాబితాలో మిగిలిన టీచర్లకు చాలా నష్టం జరుగుతుందని వాపోయారు. శ్రీనివాసులు అనే టీచర్ గత బదిలీల్లో పీహెచ్ (బ్లైండ్) కేటగిరీలో బదిలీలపై ధర్మవరం గవర్నమెంట్ స్కూల్‌కు వచ్చి పనిచేస్తున్నారని, ప్రస్తుత బదిలీల్లో ఆయన తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉందని అన్నారు. ఆయన పీహెచ్ (బ్లైండ్) కేటగిరీ వదిలేసి జనరల్ కేటగిరీకి దరఖాస్తు చేసుకుంటున్నట్లు హెచ్ఎంకు లెటర్ ఇచ్చారని, కాబట్టి ఆయన పీహెచ్ కేటగిరీ పోస్టు ఖాళీ చూపాల్సి ఉందని అన్నారు. డీఈఓ కార్యాలయంలో పీహెచ్, జనరల్ వేకెన్సీలో దేన్నీ చూపలేదని అన్నారు. దీని వల్ల ఒక పోస్టు లాస్ అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత ప్రిఫరెన్షియల్ కేటగిరీకింద దరఖాస్తు చేసి.. కేఎస్ఆర్ హైస్కూల్‌కు వచ్చారని అన్నారు. ఈ విషయంలో అనేక అవకతవకలు జరిగాయని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న జడ్పీ మేనేజ్‌మెంట్ స్కూల్ అసిస్టెంట్స్ సురేష్‌బాబు, రంగస్వామి, అమరేంద్ర కుమార్‌రెడ్డి, మాదార్‌బీ నిబంధనలకు విరుద్ధంగా మళ్లీ ప్రభుత్వ యాజమాన్య స్కూళ్లకు బదిలీపై వచ్చారని, విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

32 మంది హెచ్ఎన్ఎస్ఎస్ ఉద్యోగుల బదిలీ

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో హంద్రీనీవా సుజల స్రవంతి పథకం (హెచ్ఎన్ఎస్ఎస్) లో పని చేస్తున్న 32 మంది ఉద్యోగులను బదిలీ చేశారు. ఎస్ఈ రాజాస్వరూప్‌కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇద్దరు సూపరింటెండెంట్లు, ఏడుగురు సీనియర్ అసిస్టెంట్లు, 12మంది జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు రికార్డు అసిస్టెంట్లు, ఐదుగురు అటెండరకు స్థానచలనం కల్పించారు. టెక్నికల్ ఆఫీసర్, ముగ్గురు అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్లు, ఇద్దరు చొప్పున జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. సంఘాల పేరుతో ఏళ్లుగా ఒకేచోట పాతుకుపోయిన ఉద్యోగులను బదిలీ చేయడం పట్ల ఆ శాఖ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

పీఆర్‌లో సిఫార్సులకే సై..!

అనంతపురం న్యూటౌన్ జూన్ 11(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ జేఈఈ, ఏఈఈ, ఏఈ బదిలీల్లో నిబంధనలు పాటిస్తున్నామని చెబుతున్నా, సిఫార్సులకే మొగ్గు చూపుతున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. సిఫార్సు లెటర్ ఉన్నవారికే ఈఎన్‌సీ బాలు నాయక్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్న ప్రచారం జరుగుతోంది. క్యూసీ, పీఐయూ నుంచి పీఆర్ఐకి పంపాలనే ఉద్దేశం ఉన్నప్పుడు తిరిగి మరోప్రాంతంలో ఉన్న వారికి ఆ రెండు విభాగాల్లో చోటు కల్పించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆరోగ్యం సహకరించకున్నా ప్రస్తుతం ఉన్న క్యూసీ స్టేషన్‌కు వచ్చి 8 నెలలే అవుతున్నా తాజాగా బదిలీ చేయడంపై ఉద్యోగ వర్గాలు పెదవి విరుస్తున్నాయి. ఐదేళ్ల పూర్తయిన వారు కూడ ఏదో ఒక సాకుతో వారికి కావాల్సిన స్థానం కోసం పైరవీలు చేస్తున్నారు. అయితే 8 నెలల కిందటే క్యూసీ విభాగానికి వచ్చి మరో ప్రాంతానికి ఎంఈఓగా నియమించినా నోరు మెదపకుండా ఆ అధికారి వెళ్లారు. ప్రస్తుత బదిలీల్లో 15 మందిని బదిలీ చేస్తే.. ముగ్గురిని క్యూసీ నుంచి ఎంఈఓ లుగా నియమించారు. దీంతో పాటు పీఐయూ నుంచి ఇద్దరిని క్యూసీకి నియమించారు.

డీపీఆర్వోగా బాలకొండయ్య

అనంతపురంటౌన్, జూన్11(ఆంధ్రజ్యోతి): జిల్లా పౌరసంబంధాల అధికారి (డీపీఆర్వో)గా బాలకొండయ్యను నియమించారు. తిరుపతి నుంచి ఈయన బదిలీపై వచ్చారు. ఏపీఓగా చిత్తూరు నుంచి వెంకటరమణ, ఏపీఆర్వోగా శ్రీసత్యసాయి జిల్లా నుంచి బాబాఫక్రుద్దీన్‌ను జిల్లాకు నియమించారు. వీరు సోమవారం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని సమాచార శాఖ వర్గాలు తెలిపాయి. ఇక్కడ డీపీఆర్వోగా ఉన్న గురుస్వామి శెట్టి, ఏపీఓ రమేష్‌బాబును తిరుపతికి, ఏపీఆర్వో హరినాథ్ నాయక్‌ను శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీ చేస్తూ సమాచార శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

గాలివాన బీభత్సం

కురుకుండ్ల కాలనీలో గొర్రెల కాపరి మృతి



చెట్టువిరిగి వాహనంపై పడిన దృశ్యం

రామగిరి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు సమీపంలోని కురుకుండ్ల కాలనీలో మంగళవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. ఈ వర్షానికి గొర్రెల కాపరి మృతిచెందగా మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. 35 విద్యుత్ స్తంభాలు, రెండు ట్రాన్స్‌ఫార్మర్లు పలు చెట్లు నేలకొరిగాయి. రాత్రి 8-30గంటలకు ప్రారంభమైన గాలివాన కు ఆ కాలనీ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. గొర్రెల వ ద్ద కాపలా ఉన్న అశ్వత్థప్ప(70) మంచంపై నిద్రిస్తుండగా గాలికి అది ఎగిరిపోయిం ది. దీంతో కిందపడిన అశ్వత్థప్ప తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. అతడితో పాటు పడుకున్న మనవడు శ్రీనివాసులు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. అశ్వత్థప్పది పరిగి మండలం చిన్నపల్లి గ్రామం. అయితే అతడి అల్లుడు రాము గొర్రెల మేపుకోసం వచ్చాడని గ్రామస్థులు తెలిపారు. ఈ వర్షానికి విద్యుత్‌స్తంభాలు విరిగి పడ్డాయి. రెండు ట్రాన్స్ ఫార్మర్లు కూడా పడిపోయా యి. గృహాల మీద వేసుకున్న రేకులు కూడా దెబ్బతిన్నాయి. నర్సరీల పైకప్పుడు పూర్తిగా గాలికి కొట్టుకుపోయాయి.

రైతులకు ప్రభుత్వం అండ

రైతుసేవా కేంద్రాల ద్వారా సేవలు: కలెక్టర్

ఘనంగా ఏరువాక పౌర్ణమి

కూడేరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం కూడేరు మండలం కొర్రకోడు గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఎద్దులు, గొర్రుకు పూజలు చేసి విత్తనం వేసి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన సేవలను రైతుసేవా కేంద్రాల ద్వారా పొందవచ్చని తెలిపారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమయిందని, రైతులకు అవసరమైన విత్తన కాయలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు సమృద్ధిగా పెరిగాయని అన్నారు. రైతులు చిరుధాన్యాల సాగుకు ముందుకురావాలని, ప్రభుత్వం తగిన ప్రోత్సాహం ఇస్తుందన్నారు. అనంతరం కలెక్టర్ నాగలి పట్టి విత్తనం వేశారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, పశుసంవర్థక శాఖ జేడీ వెంకటస్వామి, డీసీఓ అరుణకుమారి, ప్రకృతి వ్యవసాయం డీపీఎం లక్ష్మానాయక్, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఏపీవో పోలేరయ్య, ఏఓ విజయ్‌కుమార్, హౌసింగ్ ఏఈ అశోక్ పాల్గొన్నారు.



విత్తన గొర్రును తోలుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

షాకింగ్ బదిలీలు..!

పట్టుపరిశ్రమ శాఖలో చోద్యం

దరఖాస్తులు, రిక్వెస్టులు లేకుండానే స్థానచలనం

ఉన్నఫలంగా ఉత్తర్వులు జారీ... విస్మయం వ్యక్తంచేస్తున్న ఉద్యోగులు

అనంతపురం సెంట్రల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పట్టుపరిశ్రమ శాఖ అధికారులు.. ఉద్యోగులకు షాక్ ఇచ్చారు. బదిలీకి దరఖాస్తు చేసుకోకున్నా.. రిక్వెస్టు కూడా పెట్టుకోకున్నా.. ఉన్నఫలంగా బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆశ్చర్యపోవడం ఉద్యోగుల వంతైంది. బదిలీల నోటిఫికేషన్ విడుదలచేసి, దరఖాస్తులు స్వీకరించాలి. ఒకేచోట ఐదేళ్ల పూర్తిచేకున్న వారిని బదిలీచేయాలి. రిక్వెస్ట్ కింద కొందరికి స్థానచలనం కల్పించవచ్చు. ఇవే పాటించకుండానే ఉన్నఫలంగా బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో ఒకేసారి 15 మంది పట్టుపరిశ్రమ అధికారుల(ఎస్ఓ)కు స్థానచలనం కల్పించారు. వీరిలో ఏడుగురిని ఇతర జిల్లాలకు ట్రాన్స్‌ఫర్ చేశారు. బదిలీ అయినవారిలో ఇద్దరు చొప్పున డీఎస్‌లు, ఏడీలు ఒకేచోట ఐదేళ్ల సర్వీసు కూడా పూర్తి చేసుకోలేదు. అయినా ట్రాన్స్‌ఫర్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బందులు పడిన అధికారులనే మళ్లీ బదిలీ చేయడం గమనార్హం. గత ప్రభుత్వంలో చక్రంతిప్పిన ఉన్నతాధికారుల సలహాలతోనే బదిలీలు చేశారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

డీఎస్ఓలు, ఏడీలు కూడా...

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పట్టుపరిశ్రమ శాఖాధికారు(డీఎస్ఓ)లుగా పనిచేస్తున్న వారిని ఇతర జిల్లాకు బదిలీచేశారు. అనంతపురం డీఎస్ఓ అంజనేయులును కర్నూలుకు, శ్రీసత్యసాయి డీఎస్ఓ పద్మమ్మను చిత్తూరుకు పంపారు. సొంతజిల్లా కర్నూలుకు వెళ్తానని ఆంజనేయులు ట్రాన్స్‌ఫర్ రిక్వెస్ట్ పెట్టుకోగా.. చిత్తూరు జిల్లా వాసి అయిన పద్మమ్మ అలాంటిదేమీ పెట్టుకోలేదు. అనంతపురం డీఎస్ఓ బాధ్యతలను కళ్యాణదుర్గం ఏడీ ఉషావర్ధినికి ఎఫ్ఏసీగాను, శ్రీసత్యసాయి డీఎస్ఓగా చిత్తూరు నుంచి శోభారాణిని నియమించారు. అనంతపురం ఏడీగా కర్నూలు నుంచి విజయకుమార్ రానున్నారు. మరో నలుగురు ఏడీలు కూడా బదిలీ అయ్యారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

గత ప్రభుత్వంలో ఇబ్బంది పడ్డవారినే..

జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న ఎస్ఓ బాధ్యతలు చేపట్టి ఏడాదిన్నర కాకముందే పెనుకొండకు బదిలీ అయ్యారు. కళ్యాణదుర్గంలో పనిచేస్తున్న మరో ఎస్ఓ అనంతపురం నుంచి అక్కడికి రెండేళ్ల క్రితం వెళ్లారు. ఈ ఎస్ఓకు స్పౌజ్ ఆప్షన్ ఉంది. అయినా ఇతర జిల్లాకు బదిలీ చేశారు. పెనుకొండలో పనిచేస్తున్న ఎస్ఓ గత ప్రభుత్వంలో నానా కష్టాలుపడ్డారు. అర్హతలున్నా ఎస్ఓగా ప్రమోషన్ ఇవ్వలేదు. చేసేదిలేక చివరకు ఎస్ఓగా ప్రమోషన్ పొంది పెనుకొండలో పనిచేస్తున్నారు. ఈ ఎస్ఓను కూడా జిల్లాను దాటించేశారు. కదిరిలో పనిచేస్తున్న మరో ఎస్ఓది వేరే గాథ. కుటుంబ సభ్యులు మంచానపడ్డారని అనంతపురం నుంచి అమరావతి వరకు వేడుకున్నా కరుణించలేదు. నిర్దాక్షిణంగా పనిచేయించారు. ప్రస్తుతం ఈ ఏఎస్ఓను ఇతర జిల్లాకు పంపారు. ఇలా అత్యధిక మంది గత ప్రభుత్వంలో ఇబ్బందులు పడ్డవారే బదిలీ అయ్యారని పట్టుపరిశ్రమ శాఖ ఉద్యోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కొందరు ఏడీలు బాధితులుగా మిగిలిపోవడం శోచనీయం. ఐదేళ్ల పూర్తికాకున్నా, రిక్వెస్ట్ పెట్టుకోకున్నా, అంగీకారం లేకుండానే బదిలీలు చేయడంపై సర్వత్రా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఎస్ఓల బదిలీల వివరాలివీ..

ఎస్ఓ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
రవీంద్ర రెడ్డి	కుప్పం	ధర్మవరం
బాలసుబ్రహ్మణ్యం	హిందూపురం	రాయచోటి
నాగభూషణం	పెనుకొండ	మడకశిర
రాజేశ్వరి	పెనుకొండ	ధర్మవరం
సుమ ముక్తశ్రీ	హిందూపురం	అనంతపురం
హంపయ్య	కుప్పర్తి	హిందూపురం
నవీన్‌కుమార్	మడకశిర	పుట్టపర్తి
అరుణ	ఆత్మకూరు	కళ్యాణదుర్గం
రేణుక	పుట్టపర్తి	అనంతపురం
లక్ష్మిరెడ్డి	హిందూపురం	కడప
రామకృష్ణ	కదిరి	కుప్పం
సుబ్రహ్మణ్యం	మదనపల్లి	హిందూపురం
ప్రతాప్‌నాయక్	మడకశిర	పలమనేరు
శ్రావణి	పలమనేరు	మడకశిర
అజీజ్	కదిరి	హిందూపురం
జయచంద్రారెడ్డి	పెనుకొండ	కుప్పం
రాజశేఖర్	మడకశిర	కదిరి
ఫిరోజ్‌బాషా	కళ్యాణదుర్గం	పలమనేరు
ఓబులేసు	అనంతపురం	పెనుకొండ
కుసుమకుమారి	ఆత్మకూరు	కళ్యాణదుర్గం
తొలచాయ నాయక్	పలమనేరు	హిందూపురం
రవినాయక్	హిందూపురం	మదనపల్లి

వన్డే క్రికెట్ పోటీల్లో శతకాల మోత

దూసుకెళ్తున్న చిత్తూరు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 11(అంధ్రజ్యోతి): సీనియర్ వన్డే సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీలో శతకాల మోత మోగిస్తున్నారు. అంధ్రా క్రికెట్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సౌత్‌జోన్ సీనియర్ వన్డే క్రికెట్ టోర్నమెంట్ రెండో రోజు బుధవారం స్థానిక అనంతపురం క్రికెట్ స్టేడియం(ఆర్డీటీ)లో కొనసాగింది. మొదటి మ్యాచ్‌లో చిత్తూరు, కడప జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన చిత్తూరు నిర్ణీత 50 ఓవర్లలో కేవలం 4వికెట్లు మాత్రమే కోల్పోయి 389 భారీ పరుగులు చేసింది. బ్యాటర్లు అభిషేక్ రెడ్డి 108 పరుగులు, జ్ఞానేశ్వర్ 116 పరుగులు, సూర్య 63 పరుగులు చేశారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కడప 14.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 94 పరుగులు చేసింది. ఇందులో ధృవకుమార్ 59 పరుగులు చేశాడు. వర్షం కారణంగా మ్యాచ్ ఆగిపోవడంతో డ్రాగా ప్రకటించారు. మరో మ్యాచ్‌లో కర్నూలు, నెల్లూరు జట్ల మధ్య జరగగా...మొదట బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 49.4 ఓవర్లలో 212 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందులో గిరినాథ్ 66, నయీముల్లా 58 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన నెల్లూరు 25.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 163 పరుగులు చేసింది. వర్షం కారణంగా డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో నెల్లూరు 4వికెట్ల తేడాతో విజయం సాధించినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి బీమలింగారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఇచ్చిన ప్రతిహామీని నెరవేరుస్తాం

● రోడ్డు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పరిటాల సునీత


బసంపల్లిలో సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చితీరు తామని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని బసంపల్లి గ్రామంలో రూ.40లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీరోడ్లను బుధవారం ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అలాగే రూ.35వేల వ్యయంతో నిర్మించిన పశువుల నీటితొట్టెను కూడా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం వచ్చాక రాప్తాడు నియోజకవర్గంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఎంతో విధ్వంసం జరిగిందని, సీఎం చంద్రబాబు అయ్యాక ఏడాది కాలంలోనే మళ్లీ అభివృద్ధి వైపు నడిపిస్తున్నారని అన్నారు. రానున్న నాలుగేళ్లలో ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చుతామని పేర్కొన్నారు.

పాపిరెడ్డిపల్లికి బీటీ రోడ్డు ప్రారంభం

రామగిరి: మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామానికి రూ.60లక్షల ఈఏపీ నిధులతో కిలోమీటర్ మేర నిర్మించిన బీటీ రోడ్డును ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఎక్కడా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. ఒక్క రోడ్డు కూడా కొత్తగా వేసింది లేదని, కనీసం పాడైన రోడ్లను మరమ్మతు చేయలేదని వాపోయారు. మన ప్రభుత్వం వచ్చాక రోడ్ల సమస్యను చాలా వరకు పరిష్కరించామన్నారు. ఏడాదికాలంలోనే గ్రామాల్లో ఎన్నో సీసీ రోడ్లు వేశామన్నారు. వచ్చే రోజుల్లో వితంతు పింఛన్లు అందజేస్తామని, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలను సీఎం చంద్రబాబు త్వరలోనే అమలు చేయనున్నారని చెప్పారు.

ఆయా కార్యక్రమాల్లో టీడీపీ సీనియర్ నాయకులు ఎల్.నారాయణచౌదరి, రామ్మూర్తినాయుడు, మండలాల కన్వీనర్లు ముత్యాల్‌రెడ్డి, సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, ఎంపీడీఓలు బాలకృష్ణుడు, గంగావతి, ఆర్‌అండ్‌బీ అధికారులు, మాజీ సర్పంచ్‌లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

● మెగా జాబ్‌మేళాలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగాన్ని నిర్మూలించడమే తమ ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ అన్నారు. మండలంలోని కొర్రపాడు గ్రామం వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకల బాలికల పాఠశాలలో బుధవారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు జాబ్ మేళా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యేతో పాటు ఏడీసీసీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య నిర్మూలించేందుకు సీఎం చంద్రబాబు ప్రతి నియోజకవర్గంలోనూ మూడు మాసాలకు ఒక్కసారి జాబ్ మేళా నిర్వహిస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో అనేక ఉద్యోగాలు ఇచ్చేందుకు సీఎం, మంత్రి నారాలోకేష్ సన్నహాలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే మెగా డీఎస్సీ ద్వారా రాష్ట్రంలో వేలాది మందికి ఉద్యోగాలు రానున్నట్లు చెప్పారు. గత ఐదేళ్ల పాలనంతా అరాచకంగా కొనసాగిందని విమర్శించారు. అనంతరం ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామకపత్రాలను ఎమ్మెల్యే, ఏడీసీసీచైర్మన్ అందజేశారు. జాబ్‌మేళాలో వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 50 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి ప్రతాప్‌రెడ్డి, తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీఓ సాల్మన్‌రాజ్, టీడీపీ మండల కన్వీనర్ అశోక్, జిల్లా నాయకులు ఆలం వెంకటనరసానాయుడు, పసుపుల శ్రీరామిరెడ్డి, సుదర్శన్‌నాయుడు, ఎంపీపీసునీత, కన్వీనర్లు గుత్తా ఆదినారాయణ, బాలరంగయ్య, రామాంజినేయులు, పాండు, ఎర్రినాగప్ప, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అడ్మిషన్లు ఇచ్చేలా చూడండి..

శింగనమల: మండలకేంద్రంలోని బాలికల వసతి గృహంలో కేవలం 9,10,ఇంటర్ విద్యార్థినులకు మాత్రమే అడ్మిషన్లు ఇస్తున్నారని, అలాకాకుండా 6,7,8 తరగతుల విద్యార్థినులకు కూడా అవకాశం కల్పించేలా చూడాలని డీవీఎంసీ మెంబరు లోలూరు కుళ్లాయప్ప ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని కోరారు. బుక్కరాయ సముద్రం మండలం కొర్రపాడు గురుకుల పాఠశాలలో బుధవారం జరిగిన జాబ్‌మేళాకు వచ్చిన ఎమ్మెల్యేను ఆయన కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ ఎస్‌కే తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ కప్పుల పంపిణీ

అనంతపురం క్రైం,జూన్11(ఆంధ్రజ్యోతి): నగరంలో పానీపూరి తోపుడు బండ్ల వ్యాపారులకు నగరపాలిక అధికారులు పర్యావరణ హిత విస్తరాకులతో చేసిన కప్పులను అందజేశారు. నగర కమిషనర్ బాలస్వామి ఆదేశాల మేరకు బుధవారం నగరంలో 10బృందాలు ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా తనిఖీలు నిర్వహించారు. పానీపూరీ బండ్ల వ్యాపారుల వద్ద ఉన్న థర్మాకోల్ కప్పులను స్వాధీనం చేసుకుని, అందుకు బదులుగా పర్యావరణహిత కప్పులను అందజేశారు. తర్వాత నిబంధనల మేరకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంహెచ్‌ఓ, డీఈ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

23 మందికి షైనింగ్ స్టార్స్ అవార్డులు


విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం విద్య, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన షైనింగ్ స్టార్స్(ప్రతిభా అవార్డు)లో శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ చూపి అధిక అవార్డులు సొంతం చేసుకోవడం ఆనందంగా ఉందని ఆ విద్యాసంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. స్థానిక రాంనగర్‌లోని కమ్మభవన్ సమీపంలో గల 6వ బ్రాంచ్ పాఠశాలలో బుధవారం షైనింగ్ స్టార్స్ అవార్డులు పొందిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఏజీఎం హాజరై మాట్లాడారు. షైనింగ్ స్టార్స్ అవార్డుల జాబితాలో అనంతపురం జోన్ వ్యాప్తంగా శ్రీచైతన్య విద్యార్థులు 23 మంది ఉండటం గర్వకారణమన్నారు. అనంతరం ఆ విద్యార్థులను ఆయన అభినందించారు. ప్రిన్సిపాళ్లు విశ్వనాథ్, సమీనాఖాన్, తబసుమ్, వెంకటేష్, నరేష్, పర్వీన్‌భాను, నేత్రావతి, శాంత, రాధిక, ఫిలిప్, వీరేష్, పురుషోత్తం, నారాయణస్వామి,మధు, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధరాత్రి యథేచ్ఛగా దొంగల చక్కర్లు

● నగరంలో గస్తీపై సందేహాలు


దొంగ ఇంటివైపు వెళ్తుండగా సీసీ కెమెరాలో రికార్డైన దృశ్యం

అనంతపురం క్రైం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నగరంలో అర్ధరాత్రి సమయాల్లో దొంగలు చక్కర్లు కొడుతున్నారు. ఎవరో వచ్చారని సీసీ కెమెరాలు పరిశీలించి స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. దుండగులు కొన్ని ప్రాంతాల్లో చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడుతుండగా.. చిన్న మొత్తాలు కావడంతో బాధితులు పోలీస్‌స్టేషన్ల వైపు వెళ్లడం లేదని తెలుస్తోంది. ఈనెల 9వ తేదీ తెల్లవారుజామున 2గంటల సమయంలో ఇద్దరు దొంగలు నగరంలోని మూడో రోడ్డులో సంచరించారు. అక్కడ ఓ వ్యక్తి కొంతకాలం ఇంటిని ఖాళీ చేశాడు. అర్ధరాత్రి దాటాక ఇద్దరు వ్యక్తులు బైక్‌లో వచ్చారు. ఆ ఇంటి ఆవరణలోకి వెళ్లి మోటారును తీసుకెళ్లారు. ఏసీ అపహరణ కోసం ప్రయత్నించారు. కిటికీ అద్దాలు పగలకొట్టినా ఫలితం లేకపోయింది. అనంతరం పక్కనే ఉన్న మరో ఇంట్లో చొరబడ్డారు. ఆ ఇంట్లో కుటుంబసభ్యులు ఉండటంతో అవకాశం లేక వెనుదిరిగారు. రెండు రోజుల ముందు పలు ద్విచక్రవాహనాల నుంచి అర్ధరాత్రి సమయంలో పెట్రోల్ దొంగలించారట. దీంతో నగరంలో గస్తీపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు గట్టిగా దృష్టి సారించకపోతే దొంగలు సొంత ఇళ్లల్లా అన్ని ప్రాంతాల్లో సంచరిస్తూనే ఉంటారు.

పేదల ఇళ్లకు కరెంటు మీటర్లు ఇవ్వాలి: సీపీఎం



విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు కాలనీల్లో గల పేదల ఇళ్లకు కరెంటు మీటర్లు ఇవ్వాలని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వివిధ కాలనీల ప్రజలతో కలిసి జేఎన్‌టీయూరోడ్డులో గల విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల నివసిస్తున్న కాలనీల పట్ల విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. గతంలో ఇదే ఆఫీసు వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఇదే సమస్యపై ధర్నా చేయగా.. అప్పుడున్న అధికారులు డీడీలు కట్టండి కరెంటు మీటర్లు ఇస్తామని చెప్పారన్నారు. ఆ ప్రకారం పేదలు రూ.2వేలు డీడీ రూపంలో కట్టి ఏడాదవుతోందన్నారు. అయినా ఇంతవరకు డి-6 సెక్షన్ అధికారులు మీ టర్లు ఇవ్వడం లేదన్నారు. గతంలో కట్టిన డీడీలు ఇప్పుడు పనికిరావని చెప్పడం సరికాదన్నారు. మానవతా దృక్పథంతో ఆలోచించి ఆ డీడీలతోనే కరెంటు మీటర్లు ఇవ్వాలని కోరారు. ఇందుకు ఈఈ రమేష్, డీఈఈ శ్రీనివాసులు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శివర్గ సభ్యులు ప్రకాష్, మసూద్, ఇర్ఫాన్, మల్లు స్వరాజ్యం కాలనీ శాఖ కార్యదిర్శి హాజీవలి, సీతారాం ఏచూరి కాలనీ నాయకులు శంకర్, మని, ఇజ్రాయిల్ అలీ, వలీ, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక పట్ల అసభ్య ప్రవర్తన

● వరుసకు పెదనాన్న అయ్యే వ్యక్తి దురాఘతం

● పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు

చెన్నేకొత్తపల్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వరుసకు పెదనాన్న అయ్యే దాదాపు 55 ఏళ్ల ఉన్న వ్యక్తి రూ.100 ఆశచూపి 10ఏళ్ల వయసున్న ఓ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ అమానవీయ సంఘటన మండలంలోని ఓ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో దాయాదులైన అన్నదమ్ముల ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. ఉదయం బాలిక తండ్రి ఆటోకు వెళ్లగా.. తల్లి కూలి పనులకు వెళ్లింది. ఇంటి వద్ద బాలిక ఆడుకుంటుండగా ఆ పక్క ఇంటిలో ఉన్న పెదనాన్న వరుస అయిన చంద్రమోహన్ డబ్బులు ఆశచూపి ఇంటిలోకి రమ్మని సైగలు చేశాడు. దీంతో ఆ బాలిక బయపడి నిరాకరించింది. చంద్రమోహన్ ప్రవర్తనను గమనించిన బాలిక సొంత పెదనాన్న మారుతి విషయాన్ని బాలిక తల్లికి ఫోన్‌ద్వారా తెలిపాడు. ఆమెఇంటికి చేరుకుని మారుతితో కలిసి నిందితుడికి దేహశుద్ధి చేయగా పరారయ్యాడు. అనంతరం తల్లిదండ్రులు పోలీసుస్టేషన్‌కు చేరుకుని జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి పరారిలో ఉన్న చంద్రమోహన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఏడాది క్రితం కూడా అతను ఆ బాలికపై ఇదే రీతిలో అసభ్యకరకంగా ప్రవర్తించినట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా ఇమామ్


ఇమామ్‌ను సత్కరిస్తున్న నాయకులు

అనంతపురం న్యూటౌన్ జూన్ 11 (ఆంధ్రజ్యోతి) కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా ఎంఎండీ ఇమామ్ నియమితులయ్యారు. నియామక పత్రాలు అందుకున్న ఆయనకు రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఇమామ్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రం పరిధిలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

కాగా అనంతపురం నియోజకవర్గ సమన్వయకర్తగా అవకాశం కల్పించాలని ఇమామ్ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను కోరారు. దీంతో అదేంటి దాదాగాంధీ సరిగా చేయడం లేదా అని ఆమె ప్రశ్నించారు. డీసీసీ అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి ఎంపిక అయినప్పటి నుంచి దాదాగాంధీ పార్టీ కార్యక్రమాల్లో పెద్దగా పాల్గొనడం లేదని అతను షర్మిల దృష్టికి తీసుకెళ్లారు. డీసీసీ అధ్యక్షుడు కబురు చేస్తేనే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. దీంతో సమస్యగా మారిందని ఆయన చెప్పుకొచ్చారు.

పీఆర్ ఏఈగా కృష్ణజ్యోతి

శింగనమల జూన్11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్‌గా క్రిష్ణజ్యోతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత 8నెలలుగా శింగనమల పీఆర్ ఏఈ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో అనంతపురం క్వాలిటీకంట్రోల్ సబ్‌డిజన్-1 ఏఈగా ఉన్న కృష్ణజ్యోతిని ఇక్కడికి పీఆర్ ఏఈగా బదిలీ చేశారు.

తహసీల్దార్ కార్యాలయంలో పలువురి బదిలీ

శింగనమల, జూన్11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పలువురు బదిలీయ్యారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రకాశ్‌రావు నార్పలకు, రీసర్వే డీటీ తహసీల్దార్ పునీత్ బాబు అనంతపురం అర్బన్‌కు బదిలీ అయ్యారు. అలాగే ఆర్ఐ నవీన్‌కూమాన్ అనంతపురం డిప్యూటేషన్‌పై వెళ్లారు. వీరి స్థానంలో కొత్తవాళ్లు రెండు రోజుల్లో విధుల్లోకి చేరే అవకాశం ఉంది.

బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఈశ్వరయ్య



అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఈశ్వరయ్య నియమితులయ్యారు. ఇదివరకు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న గౌస్ మొహిద్దీన్ పదవికి రాజీనామా చేశారు. దీంతో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ, జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి వెంకట నారాయణల సమక్షంలో బుధవారం జరిగిన జిల్లా సమావేశంలో ఈశ్వరయ్యను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లాలో బాల్ బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


సత్యనారాయణ(ఫైల్)

చెన్నేకొత్తపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగినేపల్లిలో విద్యుత్ దాఘాతంతో ఒకరు మృతి చెందారు. కొత్తచెరువు మండలం కేశాపురానికి చెందిన సత్యనారాయణ(45) స్థానికంగా ఓ సప్లయర్స్‌లో పనిచేస్తుండేవాడు. అయితే గంగినేపల్లిలో ఓ ఇంటిలో ఖర్మకాండల కోసం బుధవారం సప్లయర్స్ సామాన్లు తీసుకొచ్చాడు. అక్కడ షామియానాను ఓ ఇంటి కిటికీకి తాడుతో కడుతుండగా ఉన్నఫలంగా విద్యుత్‌షాక్‌కు గురై కిందపడ్డాడు. వెంటనే అక్కడున్న వారు కొత్తచెరువు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య ప్రభావతి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నీటితొట్టె ప్రారంభం

ఆత్మకూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పీ. సిద్దరాంపురం రోడ్డు సమీపంలో నూతనంగా నిర్మించిన పశువుల నీటితొట్టెను టీడీపీ మండల కన్వీనర్ కన్వీనర్ శ్రీనివాసులు, పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ పశువుల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం వీటిని ఉపాధి హామీ కింద నిర్మించిందన్నారు. మండలవ్యాప్తంగా 40తొట్టెలను నిర్మించినట్లు చెప్పారు. ఇందుకు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక చొరవ చూపినట్లు పేర్కొన్నారు. ఏపీఓ వెంకటనారాయణ, టీడీపీ నాయకులు రవీంద్రారెడ్డి, సుధాకర రెడ్డి, గోపాల్‌రెడ్డి, సూరి, వెంకటనారాయణ, తదితరుల పాల్గొన్నారు.

నీటికుంట నిర్మాణానికి భూమిపూజ

రాప్తాడు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరూరు గ్రామంలో నీటికుంట నిర్మాణ పనులను టీడీపీ సీనియర్ నాయకుడు మరూరు గోపాల్ బుధవారం భూమి పూజ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధి పథకం పనులకు భూమి పూజ చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పుంజుకుందని అన్నారు. నాయకుడు కేశవ, ఫీల్డ్ అసిస్టెంట్ కదరయ్య, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

భూ సమస్యను పరిష్కరించండి

గార్లదిన్నె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటంగ గ్రామంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న దళితుల భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామానికి చెందిన బాధిత రైతులతో కలిసి మండలకేంద్రంలో బుధవారం తహసీల్దార్ బండారు ఈరమ్మకు వినతిపత్రం అందజేశారు. మాల మహానాడు నాయకుడు శ్రీనివాసులు, జేఏసీ నాయకులు రామకృష్ణ, సమత తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల బాధ్యతల స్వీకరణ

శింగనమల జూన్11(ఆంధ్రజ్యోతి): శింగనమల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ము గ్గురు సూపర్‌వైజర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న గ్రేడ్-2 సూపవైజర్ ఉమాదేవి బదిలీ అయ్యారు. దీంతో గ్రేడ్-1 సూపవైజర్లుగా విష్ణువర్ధిని, కల్పన, నేతాజీబీ బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా ఇక్కడి టైపిస్టు దౌలా అనంతపురం అర్బన్ ఐసీడీఎస్‌కు బదిలీ కాగా అనిత స్థానంలో సర్దార్‌వలి బాధ్యతలు స్వీకరించారు.

విధ్వంసం నుంచి అభివృద్ధి దిశగా అడుగులు

● ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ● పలుచోట్ల రోడ్ల ప్రారంభం


రుద్రంపేటలో రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురంరూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలన విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం రూరల్ మండలం రుద్రంపేట పంచాయతీ సవేరా ఆస్పత్రి వద్ద రూ.50లక్షల వ్యయంతో నిర్మించిన సీసీరోడ్డును, 80అడుగుల రోడ్డు మార్గంలో రూ.కోటి నిధులతో అయ్యప్పస్వామి ఆలయం వరకు నిర్మించిన బీటీ రోడ్డును, భైరవ్ నగర్ ఎక్స్‌టెన్షన్‌లో రూ.50లక్షల వ్యయంతో నిర్మించిన సీసీరోడ్డును బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కిలో మీటరు రోడ్డు కూడా వేయలేదన్నారు. అడుగడుగునా విధ్వంసం సృష్టించారన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలోనే రాష్ట్రంలో రూ.36 వేల కిలో మీటర్ల మేర రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. ఒక్క అనంతపురం నగరంలోనే రూ.30కోట్ల వ్యయంతో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామన్నారు. రానున్న నాలుగేళ్లలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేయబోతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దివాకర్, డిప్యూటీ ఎంపిడిఓ వెంకటనాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్ మేళా

అనంతపురం అర్బన్: అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోని నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా ఈనెల 13వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో 13న ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల దాకాజాబ్ మేళా ఉంటుందన్నారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, సీడాప్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్ మేళాలో 50కిపైగా నేషనల్, మల్టీనేషనల్ కంపెనీలు పాల్గొననున్నట్లు చెప్పారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా , బీటెక్, పీజీ చదివిన వారి ఈ జాబ్ మేళాకు తగిన సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. naipunyam.ap.gov.in వెబ్ సైట్‌లో రిజిస్ట్రేషన్‌కు ముందుగా నమోదు చేసుకోవాలన్నారు. తర్వాత మీ ప్రొఫైల్ లాగిన్ అయ్యి అన్ని కంపెనీలకు దరఖాస్తు చేసుకొని, అడ్మిట్ కార్డుతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9010039901, 8341366022, 9490682810ను సంప్రదించాలని అన్నారు.

ఎస్కేయూ ఉద్యోగుల దాతృత్వం

అనంతపురం సెంట్రల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతిచెందిన తోటి ఉద్యోగి కుటుంబానికి ఆసరాగా నిలిచేందుకు ఎస్కేయూ ఉద్యోగులు దాతృత్వాన్ని చాటుకున్నారు. మృతుడు మహబూబ్ బాషా కుటుంబ సభ్యులకు టైంస్కేల్ ప్రాతిపదిక తోటి ఉద్యోగులు వారి ఒకరోజు వేతనం రూ.1.16లక్షలు అందజేశారు. ఈ మేరకు బుధవారం వీసీ అనిత, రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్ బాబుకు టైం స్కేల్ ఉద్యోగుల అసోసియేషన్, నాన్ టీచింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, ఫైజాక్, అసోసియేషన్ అధ్యక్షుడు తిమ్మప్ప, నాయకులు నాగముణి, చంద్రశేఖర్ నాయుడు, శివయ్య, సంజీవప్ప, రమేష్, నారాయణప్ప, నీలకంఠ పాల్గొన్నారు.

నాలుగో పట్టణ సీఐగా జగదీష్ బాధ్యతలు

అనంతపురం క్రైం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని నాలుగో పట్టణ సీఐగా జగదీష్ బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు సీఐగా ఉన్న సాయినాథ్‌ను వీఆర్‌కు పంపి.. ఆయన స్థానంలోకి పీటీసీలో పనిచేస్తున్న జగదీష్‌ను నియమించిన విషయం తెలిసిందే. జగదీష్‌కు సాయినాథ్ బాధ్యతలు అప్పగించి రిలీవ్ అయ్యారు.

నేటి నుంచి గంధం ఉరుసు


హజరత్ సయ్యద్ ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి దర్గా

అనంతపురం కల్చరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెరువుకట్టపై వెలసిన 'హజరత్ సయ్యద్ ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి' దర్గాలో గురువారం నుంచి శనివారం వరకు 141వ గంధం ఉరుసు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు దర్గాకమిటటీ సభ్యుడు పూల మన్సూర్ అలి బుధవారం ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

షార్ట్ ఫిల్మ్ పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

అనంతపురం కల్చరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రచయిత డాక్టర్ ఎస్ఎస్ గిరిధర ప్రసాద్ రాయ్ దర్శక నిర్మాతగా రూపొందించిన 'అనంతపురం చరిత్ర' అనే షార్ట్‌ఫిల్మ్ పోస్టర్లను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ నగరంలోని తన కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ గిరిధరప్రసాద్‌రాయ్ అనంతపురం జిల్లా వైభవాన్ని, చరిత్రను ప్రపంచానికి చాటిచెప్పడమే లక్ష్యంగా షార్ట్‌ఫిల్మ్‌ను రూపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు జయరామిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్, ఎడిటర్ జగదీష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. షార్ట్‌ఫిల్మ్‌లో చరణ్, రమేష్‌నీల్, శ్రీనివాసులు, నూరుల్లా తదితర నటీనటులు వివిధ పాత్రలను పోషించారు.

ప్రైవేట్ టీచర్ అదృశ్యం

అనంతపురం క్రైం,జూన్11(ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ ప్రైవేట్ టీచర్ అదృశ్యమయ్యాడు. స్థానిక రజక్‌నగర్‌కు చెందిన శంకర్ ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. కాగా కొంత కాలం క్రితం తెలిసిన వారితో అప్పులు చేశాడు. ఈ క్రమంలో ఒత్తిడి ఎదురుకావడంతో వాటిని తీర్చలేక ఈనెల 6వతేదీన అదృశ్యమయ్యాడు. గతంలోనూ రెండు సార్లు ఆయన ఇలా వెళ్లి నాలుగైదురోజులకు వచ్చాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


టీసీ వరుణ్‌ను సన్మానిస్తున్న ఎల్టీపీలు

అనంతపురం సెంట్రల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): అహుడా అభివృద్ధి కోసం పారదర్శకంగా, నిబంధనల మేరకు పని చేస్తున్న లైసెన్స్ టెక్నికల్ పర్సన్లకు ప్రభుత్వం అండగా ఉంటుందని చైర్మన్ టీసీ వరుణ్ పేర్కొన్నారు. ఎల్టీపీలు నగరంలో బుధవారం ఆయన్ను కలిసి పలు పలు సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాన్ని అందజేశారు. స్పందించిన టీసీ వరుణ్ సమస్యలను ఎప్పటికప్పుడు కార్యాలయానికి తెలియజేయాలని సూచించారు. అహుడా అనుమతి పొందడం ద్వారా హక్కుదారులకు మెరుగైన వసతులు లభిస్తాయన్నారు. అహుడా పరిధిలో టవర్స్ లాయిలెట్స్ , స్విమ్మింగ్‌ఫూల్ తదితర నిర్మాణాలు త్వరలోనే చేపతున్నట్లు వివరించారు. అనధికార లేఔట్ల అంశంలో ఎల్టీపీలు సహకారమందించి అహుడా ఆధాయం పెంపొందేలా కృషిచేయాలని కోరారు. అనంతరం టీసీ వరుణ్‌ను ఎల్టీపీలు సన్మానించారు. అధికారులు ఇషాక్, హరీష్ చౌదరి పాల్గొన్నారు.

విత్తన వేరుశనగను సద్వినియోగం చేసుకోండి

● రైతులకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన


రామగిరిలో విత్తన వేరుశనగను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

రామగిరి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీపై అందించే విత్తన వేరుశనగకాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యేపరిటాలసునీత సూచించారు. మండలకేంద్రంలోని రైతుసేవా కేంద్రంలో విత్తన వేరుశనగ పంపిణీని బుధవారం ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి పలువురు రైతులకు విత్తన కాయలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ... రైతులు విత్తన వేరుశనగ తీసుకునేముందు నాణ్యత పరిశీలించాలన్నారు. నాణ్యతలేనివి ఇస్తే వెనక్కి ఇవ్వాలని తెలిపారు. విత్తనం వేసే వారు మాత్రమే విత్తనకాయలను తీసుకెళ్లాలన్నారు. అలా కాకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలించే వారు తీసుకోరాదని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఎల్.నారాయణచౌదరి, రామ్మూర్తినాయుడు, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, నాయకులు పరంధామ, శ్రీధర్‌నాయుడు, పేపర్‌శీన, చిత్తరంజన్, రఘురాములు, జశ్వంత్ గోపాల్, నాగేశ్‌నాయుడు, మాజీ సర్పంచ్‌లుముత్యాలు, శ్రీనివాసులు, హనుమక్కులప్ప, ఎంపీడీఓ గంగావతి తదితరులు పాల్గొన్నారు.

● కనగానపల్లి: మండలకేంద్రంలో సబ్సిడీ విత్తన వేరుశనగ విత్తన కాయలను డీసీఎంఎస్, మార్కెట్ యార్డు చైర్మన్లు నెట్టెం వెంకటేష్, సుధాకర్ చౌదరి రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ రమాదేవి, టీడీపీ కన్వీనర్ యాతం పోతలయ్య, సర్పంచ్ అంకే రామక్రిష్ణ, నాయకుడు బిల్లే దాము తదితరులు పాల్గొన్నారు.

● శింగనమల: మండలంలోని కల్లుమడి, గుమ్మేపల్లి పంచాయతీల్లో రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ కాయల్ని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి డేగలకృష్ణమూర్తి, సర్పంచులు డేగల లలితమ్మ, పకీరమ్మ, ఎంపీటీసీ సభ్యుడు నల్లప్ప తదితరులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, బాలిరెడ్డి, వేణుగోపాల్, అధికారులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.31వేలు

అనంతపురంరూరల్, జూన్11(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.31,670 ధర పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.6వేలు, సరాసరి రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు చెప్పారు. మార్కెట్‌కు మొత్తంగా 789టన్నుల చీనీ కాయలు వచ్చాయని పేర్కొన్నారు.

ఉపాధి నిధులతో పండ్లతోటల పెంపకం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం నిధులతో జిల్లాలో పండ్లతోటల పెంపకం చేపట్టనున్నట్లు డ్వామా పీడీ సలీంబాషా తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 16 రకాల పండ్లతోటలు, రెండు రకాల పూల తోటలు, మునగ పంటలను రాష్ట్ర ప్రభుత్వం సాగుచేసే రైతులకు ప్రోత్సాహం అందిస్తుందని వివరించారు. ఐదెకరాల లోపు పొలం ఉన్న జాబ్‌కార్డు కలిగిన రైతులకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వర్షాధారిత పండ్లతోటల పెంపకం చేపడతామని వివరించారు. మామిడి, చీనీ, నిమ్మ, జామ, తైవాన్‌జామ, సపోట, కొబ్బరి, అల్లనేరేడు, చింత, సీతాఫలం, దానిమ్మ, అంజూర, యాపిల్‌బెర, అవకాడో, పనస, డ్రాగన్‌ఫ్రూట్, గులాబి, మల్లె, మునగ మొదలైన ఉద్యాన పంటల సాగు, నిర్వహణ ఖర్చులు మొత్తం మూడేళ్ళు చెల్లిస్తామన్నారు. ఆసక్తి, అర్హతగల రైతులు ఆయా మండలాల ఎంపీడీఓలు, ఏపీఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

వైసీపీ వారికి పుట్టగతులుండవ్

అనంతపురం రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ వారు తప్పుల మీద తప్పులు చేసుకుంటూ వెళుతున్నారని, ఇలా అయితే పుట్టగతులుండవని టీడీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కనుమ చౌడయ్య అన్నారు. ఆమేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ప్రకాశం జిల్లా పొదిలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలపై వైసీపీ మూకలు రాళ్లతో దాడి చేయడం అమానుషమన్నారు. మొన్న మహిళలను అవమాన పరిచేలా వేశ్యలు, సంకరజాతి వారంటూ అంటూ వ్యాఖ్యలు చేశారని, ఇప్పుడు ఇలా దాడులు చేశారని, ఇలాగే జరిగితే పుట్టగతులు కూడా లేకుండా పోతారని హెచ్చరించారు. తప్పుడు వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని మహిళలు నిరసన తెలిపితే ఇంతటి దారుణానికి ఒడిగడతారా అంటూ మండిపడ్డారు.

ఉత్సాహంగా ఏరువాక పౌర్ణమి

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: పలు ప్రాంతాల్లో రైతులు తమతమ పొలాల్లో ఏరువాక పౌర్ణమి పూజలను ఉత్సాహంగా నిర్వహించారు. కళ్యాణదుర్గం కృషి విజ్ఞానకేంద్రంలో ఏరువాక పౌర్ణమి పూజలను సమన్వయ కర్త డాక్టర్ చంద్రాయుడు, ఏడీఏ ఎల్లప్ప ప్రారంభించారు. అలాగే పొలంలో ఎద్దులకు పూజలు చేశారు. పెద్దవడుగూరులో నిర్వహించిన కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణయాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు ఆదినారాయణ, అల్లాబకాష్, పలువురు రైతులు పాల్గొన్నారు. బొమ్మనహాళ్ మండలంలోని శ్రీధరఘట్ట, గోవిందవాడ, ఉంతకల్లు, నేమకల్లు తదితర గ్రామాల్లో ఎద్దులకు అందంగా అలంకరించి ఊరేగించారు. వాటికి పోటీలు నిర్వహించారు. శ్రీధరఘట్టలో విజేత వృషభాల యజమానికి టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి బహుమతి అందజేశారు. రాయదుర్గం మండలంలోని మారెంపల్లి, కొండాపురం, మల్కాపురం, రేకులకుంట తదితర గ్రామంలో ఏరువాక పున్నమి పూజలు చేసి.. పొలాల్లో విత్తనాలు వేశారు. అనంతరం గ్రామాలలో ఎద్దులకు పరుగుపందెం నిర్వహించి.. గెలుపొందిన వృషభాలను ఆయా గ్రామాల్లో ఊరేగించారు.

గ్రామాల్లో వృషభాల ఊరేగింపు



పెద్దవడుగూరులో పూజలో పాల్గొన్న నాయకులు, రైతులు



కళ్యాణదుర్గంలో ఏరువాకను ప్రారంభిస్తున్న అధికారులు



శ్రీధరఘట్టలో బహుమతి అందజేస్తున్న టీడీపీ నాయకులు

న్యూస్ బాక్స్

రేపట్నుంచి ఎర్రితాత ఆరాధనోత్సవాలు



బెళుగుప్ప, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎర్రితాత ఆరాధనోత్సవాలను శుక్ర, శని, ఆదివారాలు నిర్వహిస్తున్నట్లు సేవాసంఘం సభ్యులు తెలిపారు. శాంతిధామలో శుక్రవారం గణపతి పూజ, గోపూజ, ధ్వజారోహణ స్వస్తిపుణ్యాహ వచనం, నంది వాహన సేవ, శనివారం ఉదయం అభిషేకాలు బిల్వార్చన, పల్లకిసేవ, సాయంత్రం శేష తల్ప అలంకారంలో పవిత్ర దర్శనం, అర్చనలు రాత్రి పది గంటలకు స్వామి ప్రభోత్సవ ఊరేగింపు, ఆదివానం ఉదయం మహామంగళహారతి తీర్థప్రసాదాల వినియోగం, చత్రప్రభ అలంకారం, అర్చనలు, సాయంత్రం ఉట్లపరుష, కోలాట కార్యక్రమాలు, రాత్రికి భజనలు ఉంటాయని వివరించారు.

15న దివ్యాంగులు, వృద్ధులకు శిబిరం

విడపనకల్లు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దివ్యాంగులు, వృద్ధులకు అవసరమైన పరికరాలను గుర్తించడానికి ఆదివారం ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ షకీలా బేగం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉరవకొండలోని ఎస్కే ప్రభుత్వ పాఠశాలలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తామని, పరికరాలు కావాల్సిన వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

విడపనకల్లు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదర్శ పాఠశాలలో 7,8,9 తరగతులు, ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్లకు ఈ నెల 20 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విడపనకల్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ గంగాధర్ గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు టీడీపీ విజయోత్సవ బైక్ ర్యాలీ

కళ్యాణదుర్గం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అవుతుండటంతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో పెద్దఎత్తున విజయోత్సవ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది బుధవారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రజావేదిక నుంచి ప్రారంభించే ఈ ర్యాలీలో ఐదు మండలాల్లోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్డీటీకి మద్దతుగా ధర్నా



ధర్నా చేస్తున్న ప్రజలు

గుత్తి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి విదేశీ నిధులు అందేలా ఎఫ్‌సీఆర్‌ఏ అనుమతి ఇవ్వాలని ఆ సంస్థ సభ్యులు, స్థానికులు కోరారు. బుధవారం ఈ మేరకు వారు స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. దీనికి ఎస్ఎఫ్ఐ నాయకులు సంఘీభావం తెలిపారు. ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేసేలా జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు కేంద్ర ప్రభుత్వపై ఒత్తిడి తేవాలని కోరారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ ఓబులేసుకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామదాసు, అంజనప్రసాద్, రాము, రమేష్ పాల్గొన్నారు.

గుంతకల్లు అభివృద్ధికి సహకరించండి

గుంతకల్లుటౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): అహుడా పరిధిలో గుంతకల్లు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని అనంతపురంలో అహుడా కార్యాలయంలో అహుడా చైర్మన్ టీసీ వరుణ్‌కు జనసేన పార్టీ నియోజకవర్గ బాధ్యుడు వాసిగిరి మణికంఠ బుధవారం వినతి పత్రం అందజేశారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి గుర్తింపు వచ్చేలా చూడాలని టీసీ వరుణ్‌ను కోరారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

రాయదుర్గంరూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం అర్బన్ పరిధిలోని 7, 9, 10 సచివాలయాల పరిధిలో మలేరియాపై అవగాహన ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఇందులో మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ ఎర్రిస్వామి, సూర్యనారాయణ, హెల్త్ సెక్రటరీలు సరోజమ్మ, ప్రమీళ, విజయలక్ష్మి, సుజాత మరియు ఆశా కార్యకర్త శ్రీలత పాల్గొన్నారు.

జింక అప్పగింత



అధికారులకు జింకను అప్పగిస్తున్న గ్రామస్థులు

యాడికి, జూన్11(ఆంధ్రజ్యోతి): మండలంలోని టి. కొత్తపల్లి సమీపంలో ఓ జింకపై బుధవారం కుక్కలు దాడికి యత్నించాయి. వాటి బారి నుంచి తప్పించుకోవడానికి పరుగులెత్తిన జింక జారి కింద పడి గాయపడింది. గమనించిన మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, గ్రామస్థులు కుక్కల బారి నుంచి ఆ జింకను కాపాడారు. దానికి ప్రథమ చికిత్స చేసి.. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఆ అధికారులు గ్రామానికి వచ్చి జింకను స్వాధీనం చేసుకున్నారు.

హృషికేశ్‌కు ప్రత్యేక రైలు

గుంతకల్లు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని జిల్లా మీదుగా యశ్వంతపూర్-హృషికేశ్ మధ్య ఓ ప్రత్యేక వీక్లీ రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. యశ్వంతపూర్ - యోగ్ నగరి హృషికేశ్ (నం. 06597) ప్రత్యేక రైలు యశ్వంతపూర్‌లో ఈ నెల 19, 26, జూలై 3 తేదీల్లో (గురువారాలలో) ఉదయం 7 గంటలకు బయలుదేరి రెండు రోజుల తర్వాత శనివారం ఉదయం 10-20 గంటలకు హృషికేశ్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 06598) హృషిచేశ్‌లో ఈ నెల 21, 28, జూలై 5తేదీల్లో (శనివారాలలో) సాయంత్రం 5-55 గంటలకు బయలుదేరి సోమవారం రాత్రి 7-45 గంటలకు యశ్వంతపూర్‌కు చేరుతుందన్నారు. ఈ రైలు యలహంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, డోన్, కర్నూలు సిటీ, కాచిగూడ, ఖాజీపేట్, బాలార్షా, నాగపూర్, భోపాల్, బీనా, వీరాంగన లక్ష్మీబాయి ఝాన్సీ ఆర్ఎస్, గ్వాలియర్, ఆగ్రా కంటోన్మెంటు, మధుర, హజ్రత్ నిజాముద్దీన్, ఘజియాబాద్, మీరట్ సిటీ, ముజఫ్ఫర్‌నగర్, తాప్రీ, రూర్కీ, హరిద్వార్ స్టేషన్ల మీదుగా హృషికేశ్‌కు చేరుకుంటుందని వెల్లడించారు.

విద్యా మిత్ర కిట్ల పరిశీలన

గుత్తి, జూన్11(ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు ప్రభుత్వం సరఫరా చేసిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లను స్థానిక జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిల్వ ఉంచారు. వాటిని ఎంఈఓ రవినాయక్ బుధవారం పరిశీలించారు. మండల వ్యాప్తంగా 6,896 మంది విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారం, బూట్లు సరఫరా అయ్యాయని, గురువారం నుంచి ఆ కిట్లను ఆయా పాఠశాలలకు అందజేస్తామని ఆయన తెలిపారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



పామిడిలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయరాం

పామిడి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బుధవారం భూమి పూజ చేశారు. పామిడి-వజ్రకరూరు రోడ్డు నుంచి వంకరాజుకాలువకు రూ.1.98 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం, 44వ జాతీయ రహదారి నుంచి ఎదురూరు గ్రామానికి రూ.97.85 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం, పామిడి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.1.60 కోట్లతో అదనపు వసతి గృహాల నిర్మాణం పనులను ఆయన ప్రారంభించారు. అంతనం మండలంలోని పెన్నప్ప గుడి వద్ద టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్‌తో కలిసి ఆయన ఆయన మీడియాతో మాట్లాడారు. స్థానిక ఎన్నికలకు సమయం దగ్గర పడుతోందని, కూటమి ప్రభుత్వం ఇంతవరకూ చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఐకమత్యంతో ఈ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించేలా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచు తలారి లక్ష్మిదేవి, టీడీపీ నాయకులు బొల్లు శ్రీనివాస రెడ్డి, ప్రభాకర్ చౌదరి, గౌస్‌పీరా, సంజీవకుమార్, ఈరప్ప యాదవ్, రమేష్ నాయక్, దుబ్బన్న, ఆనంద్, సుదర్శన్, జనసేన నాయకులు ధనుంజయ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

● గుంతకల్లు: పట్టణంలో పలు వార్డులు, మండలంలోని గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ, 35వ వార్డు, 3వ వార్డు, 4వ వార్డుల్లో డ్రెయిన్ల నిర్మాణానికి రూ.40 లక్షలతో భూమిపూజ చేశారు. మున్సిపాల్టీకి వచ్చిన రెండు శానిటేషన్ ట్రాక్టర్లను లాంచనంగా ప్రారంభించారు. మండలంలోని గుండాలతండాలో రూ.1.50 కోట్లతో తాగునీరు, రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. నక్కనదొడ్డిలో గోకులం షెడ్లను ప్రారంభించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భవాని, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బండారు ఆనంద్, కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, మహమ్మద్ షరీఫ్, గుజరీ మహమ్మద్ ఖాజా, ఫజులు, అంజి, శివన్న పాల్గొన్నారు.

చెత్త సేకరణ బండ్లను మూలనపడేస్తే ఎలా?



చెత్త సేకరణ బండ్లను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

యాడికి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక డంపింగ్ యార్డును అనంతపురం డీఎల్‌పీఓ విజయకుమార్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. చెత్తసేకరణ బండ్లను డంపింగ్ యార్డులో ఒక మూలన పడేసిన ఉండటాన్ని ఆయన గమనించారు. ఆ బండ్లను ఇలా నిరుపయోగంగా పడేస్తే గ్రామంలో చెత్తసేకరణ ఎలా చేస్తారని సీనియర్ అసిస్టెంట్ లక్షేంద్రను ప్రశ్నించారు. కొన్ని బండ్లు మరమ్మతులకు గురయ్యాయని, మరికొన్ని పూర్తిగా పనికి రాకుండా పోయాయని ఆయన సమాధానమిచ్చారు. అధికారుల అనుమతితో వాటికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి

విడపనకల్లు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పుమడుగు గ్రామంలో దుర్గమ్మ గుడి వద్ద నుంచి ఊరి చివరి వరకూ చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు బుధవారంతో పూర్తి అయ్యాయి. ఆ రోడ్డును గ్రామ సర్పంచ్ తిప్పారెడ్డి, కార్యదర్శి మునాఫ్ పరిశీలించారు. ప్రత్యేక నిధులతో దీన్ని నిర్మించడానికి చొరవ చూపిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



రోడ్డును పరిశీలిస్తున్న సర్పంచ్, కార్యదర్శి



కణేకల్లులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న విప్ కాలవ

రాయదుర్గం అభివృద్ధే ధ్యేయం: విప్ కాలవ

రాయదుర్గం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా మార్చాలన్నదే తన లక్ష్యమని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సమైన సందర్భంగా ఆయన బుధవారం తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. రూ. 35 కోట్లతో తుంగభద్ర ఎగువ కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టామన్నారు. మాల్యం బ్రాంచ్ కాలువ పనులు ప్రారంభించామన్నారు. అధ్వానంగా మారిన రహదారుల నిర్మాణానికి రూ. 19.31 కోట్లతో తారురోడ్డు మంజూరు చేశామన్నారు. గ్రామాల్లో దాదాపు రూ. 40 కోట్లతో సీసీ రోడ్లు వేయించామన్నారు. పట్టణంలో ఆగిపోయిన రైల్వే బ్రిడ్జిల పనులను త్వరలో పునః ప్రారంబిస్తామన్నారు. కనీస మద్ధతు ధరతో ధాన్యం, కంది, జొన్న కొనుగోలు చేశామన్నారు.

● కణేకల్లు : స్థానిక నేసేపేటకు వెళ్లే రహదారిలో రూ. 72 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఏడాదిలో నియోజకవర్గ వ్యాప్తంగా రూ. 20.30 కోట్లతో సీసీ రోడ్లు వేయించామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతరెడ్డి, సర్పంచ్ నిర్మల, టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, ఆది, కోకుర్తి సుదర్శన్, బీటీ రమేష్, షేక్‌ముజ్జు, బాయినేని నవీన్, కురుబ నాగరాజు, చంద్రశేఖర్ గుప్తా, మాబుసాబ్, చాంద్‌బాషా, అనిల్ పాల్గొన్నారు.

జీడిపల్లి రిజర్వాయర్ పరిశీలన



ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్లు

బెళుగుప్ప, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి, కోణంపల్లి గ్రామాల్లో బుధవారం ట్రైనీ కలెక్టర్ల బృందం పర్యటించింది. ఈ బృందంలో సచిన్ రాహర, నరేంద్ర పాడల్, పృథ్వీరాజ్ కుమార్, పరిహీన్ జాహిద్, మనీషా సందీప్, రఘువంశీ, నాగ వెంకటసాహిత్ ఉన్నారు. రిజర్వాయరు గురించి హంద్రీనీవా అధికారులు వారికి వివరించారు. అనంతరం కోణంపల్లిలో డ్రిప్ పద్ధతిలో సాగును హార్టికల్చర్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఫిరోజ్ ఖాన్ వివరించారు. వీరి వెంట హంద్రీనీవా ఎస్ఈ రాజస్వరూప్‌కుమార్, ఈఈ శ్రీనివాసు, ఆర్డీఓ వసంతబాబు, తహసీల్దార్ అనిల్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారులు కృష్ణతేజ, మల్లేష్ ఉన్నారు.

సాగు సమస్యలు పరిష్కరించండి



అధికారులతో మాట్లాడుతున్న రైతులు

వజ్రకరూరు (ఉరవకొండ), జూన్ 11(ఆంధ్రజ్యోతి): అటవీ భూముల్లో సాగు చేస్తున్న గిరిజన రైతుల సమస్యలను పరిష్కరించాలని వెంకటాంపల్లి తండా గ్రామస్థులు అధికారులను కోరారు. మండలంలోని వెంకటాంపల్లి పెద్దతండా (రూపానాయక్ తండా)లో దర్తీయా జనజాగృతి ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. రూపానాయక్ తండాను రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేసి, వీఆర్వోను నియమించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో డీటీడబ్ల్యూఓ రామాంజినేయులు, డీఎల్‌డీఓ విజయ్‌లక్ష్మి, తహసీల్దారు నరేష్, ఎంపీడీఓ శివాజీరెడ్డి, కేశవ్‌నాయక్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు

గుత్తి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో దాదాపు రూ. 25 లక్షలతో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. దీన్ని ఎంఈఓ రవినాయక్ బుధవారం తనిఖీ చేశారు. 35 కంప్యూటర్లు వచ్చాయని, మిగిలినవి త్వరలో వసాయని తెలిపారు.

నీటితొట్టెలు ప్రారంభం

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: పలు ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన పశువుల తాగునీట తొట్టెలను అధికారులు, టీడీపీ నాయకులు బుధవారం ప్రారంభించారు. రాయదుర్గం మండలం బీఎన్‌హళ్లిలో ఎంపీడీఓ కొండన్న, యాడికి మండలం వేములపాడులో ఎంపీడీఓ వీరరాజు, బెళుగుప్పలో టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, పెద్దవడుగూరు మండలం మిడుతూరు గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు రమేష్ యాదవ్, కుందుర్పి మండలం వడ్డేపాలెం గ్రామంలో మండల అభివృద్ధి అధికారి లక్ష్మీశంకర్ పశువుల నీటి తొట్టెలను ప్రారంభించారు.



బెళుగుప్పలో తొట్టెను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ, టీడీపీ నాయకులు





వేములపాడు, బీఎన్‌హళ్లిలో నీటితొట్టెలను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

క్రైం న్యూస్..

యువకుడి ఆత్మహత్య



రాజేష్ మృతదేహం

గుంతకల్లు టౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పాతగుంతకల్లులోని కుమ్మరమ్మ కట్ట వద్ద నివాసముంటున్న వడ్డె మునిస్వామి, సుజాతల కుమారుడు వడ్డె రాజేష్ (20) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజేష్ డేకరేషన్ పనిచేసేవాడు. అతను ఇటీవల మద్యానికి అలవాటు పడి.. డేకరేషన్ పనులకు వెళ్లేవాడు కాదు. తల్లిదండ్రులు మందలించడంతో జీవితంపై విరక్తి చెందిన రాజేష్.. మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం రాజేష్ చనిపోయి ఉండటాన్ని గమనించిన కుటుంబ సభ్యులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



రాధిక మృతదేహం

గుమ్మఘట్ట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం విద్యుదాఘాతానికి గురై రాధిక (33) మరణించింది. ఆమె ఇంట్లోని ఫ్రిడ్జ్ వైర్ కట్ అయి.. సమీపంలో ఉన్న బీరువాకు తగిలింది. వేకువజామున ఇంట్లో ఆమె బండ్లను శుభ్రం చేస్తూ ఆ బీరువాను తాకి.. షాక్‌కు గురై స్పృహ కోల్పోయింది. భర్త రవికుమార్, కుటుంబసభ్యులు ఆమెను రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మరణించింది. ఆమెకు ఒక కుమారుడు, ఆరునెలల కూతురు ఉన్నారు. గుమ్మఘట్ట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బేకరీ యజమానికి జరిమానా

కణేకల్లు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కణేకల్లు క్రాసింగ్‌లోని బెంగుళూరు బేకరీకి రూ. 25 వేలు జరిమానా విధించినట్లు తూనికల కొలతల అధికారి శంకర్ బుధవారం తెలిపారు. బేకరీలో కూల్‌డ్రింక్‌లతో పాటు బిస్కెట్‌లను అధిక ధరలకు విక్రయించడంతో ఆ బేకరీ యజమానిపై కేసును నమోదు చేసి జరిమానా విధించామన్నారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

రాయదుర్గంరూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపరాల గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన లైన్‌మన్ చిన్నతిప్పన్న బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. వేపరాల గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ బైక్ వస్తూ.. ఎదురుగా వస్తున్న తిప్పన్న బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో గాయపడ్డ వీరిద్దరిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. చిన్న తిప్పన్న కోమాలోకి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

టిప్పర్ కింద పడి..

గుమ్మఘట్ట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేలోడు గ్రామంలో టిప్పర్ కిందపడ్డ మహేశ్వరరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం గ్రామ సమీపంలో కలుగోడు రోడ్డుకు టిప్పర్ మట్టి తోలుతుండగా.. బైక్‌పై వెళ్లిన మహేశ్వరరెడ్డి అదుపుతప్పి టిప్పర్ కింద పడడంతో గాయపడ్డాడు. అతన్ని కుటుంబసభ్యులు రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గుమ్మఘట్ట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మట్కాబీటర్ల అరెస్ట్ - రూ.3.05 లక్షలు స్వాధీనం

తాడిపత్రి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ మున్సిపల్ రూముల సమీపంలో 12 మంది మట్కాబీటర్లను అరెస్ట్ చేసినట్లు అడిషనల్ ఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి బుధవారం తెలిపారు. వారివద్ద నుంచి రూ.3.05 లక్షలు, సెల్‌ఫోన్లు, మట్కాచిట్టీలు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు.

విత్తన వేరుశనగ పంపిణీ



వేరుశనగకాయలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

వజ్రకరూరు(ఉరవకొండ), జూన్ 11(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని ప్యాపిలిలో విత్తన వేరుశనగ కాయలను టీడీపీ నాయకులు నాగేంద్ర, నాగన్న బుధవారం పంపిణీ చేశారు. 63 మంది రైతులకు 200 బ్యాగులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఈఓ గంగన్న, టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణ, ఓబులేశు, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

వసతి గది నిర్మాణానికి రూ.6 లక్షలు విరాళం

గుంతకల్లుటౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసాపురం గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనారాయణ స్వామి రాతి దేవాలయంలో ఒక వసతి గది నిర్మాణానికి కర్నూలు జిల్లా పత్తికొండ గ్రామానికి చెందిన పుల్లయ్యయాదవ్, సరోజిని దంపతులు ఆలయ ధర్మకర్త తలారి పరుశురాముడుకు బుధవారం రూ. ఆరు లక్షలను విరాళం అందజేశారు. అర్చకులు ఆ దంపతుల పేరట అర్చనలు చేసి పూజలు చేశారు.

● పాఠశాలకు రూ.లక్ష...

పామిడి: పట్టణంలోని సరస్వతీ విద్యా మందిరం నిట్టూరు నిలయం పాఠశాలలో నూతన తరగతి గదుల నిర్మాణానికి డాక్టర్ బెక్కెం రామిరెడ్డి, బెక్కెం విజయమ్మ దంపతులు రూ. లక్ష విరాళం అందజేసినట్లు పాఠశాల కమిటీ సభ్యులు తెలిపారు. అమెరికాలో ఉన్న స్థానిక డాక్టర్ బెక్కెం రామిరెడ్డి ఆన్‌లైన్ ద్వారా ఆ నగదును అందజేశారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి

గుత్తి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని కొత్తపేట గ్రామ పంచాయతీ పరిధిలో సర్వే నెంబర్ 249లో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు స్వార్థపరులు కబ్జా చేయడానికి యత్నిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఇసాక్, గ్రామస్థులు డిమాండ్ చేశారు.ఈ మేరకు తహసీల్దార్ ఓబులేసుకు బుధవారం ఫిర్యాదు చేశారు. గుత్తి, తాడిపత్రి రహదారిలోని నాలుగు లైన్ల రహదారి విస్తీర్ణంలో భాగంగా అప్పట్లో ఎల్ఎఫ్ రోడ్డు మిగిలిపోయిందని, ఆ స్థలాన్ని గ్రామ పంచాయతీ అభివృద్ధికి కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. స్వార్థపరులు ఆ స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయ్నతిస్తున్నారని, ఆ స్థలాన్ని పంచాయతీకి కేటాయించాలని తహసీల్దారును కోరారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

పుట్లూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆరు రోజుల పాటు నిర్వహించే ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అలివేలమ్మ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12, 13 తేదీల్లో పుట్లూరు, ఎల్లుట్ల, 24, 25 తేదీల్లో తక్కళ్లపల్లి, కుమ్మనమల, 26, 27 తేదీల్లో తక్కళ్లపల్లి, మడ్డిపల్లి గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి సచివాలయ పరిధిలో పాఠశాల విద్యార్థులు తమ ఆధార్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

గోకులం షెడ్డు ప్రారంభం

బ్రహ్మసముద్రం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సుమారు రూ.2.30 లక్షలతో నిర్మించిన చన్నమల్లప్ప గోకులం షెడ్డును స్థానిక టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, జెడ్పీటీసీ ప్రభావతమ్మ బుధవారం ప్రారంభించారు. ఇందులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.